## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 30-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

### ముఖ్యాంశాలు

- మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా రాష్ట్రపతి, ప్రధానమంత్రి సహా పలువురు ప్రముఖులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా అస్సాంలోని దిబ్రుగఢ్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఈరోజు ప్రారంభించారు.
- భద్రతా మండలిలో ఆసియా ప్రాతినిధ్యం తక్కువగా ఉన్నందున తిరిగి సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉందని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ అన్నారు.
- సముద్ర ఆర్థిక వ్యవస్థకు, బ్లూ ఎకానమీ దార్శనికతకు విశాఖ సహజ కేంద్రంగా మారుతుందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

మహాత్మాగాంధీ 78వ వర్ధంతి సందర్భంగా ఈరోజు న్యూఢిల్లీ రాజ్‌ఘాట్‌లోని గాంధీ సమాధి వద్ద సర్వధర్మ ప్రార్థన నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ రాజ్‌ఘాట్‌ను సందర్శించి మహాత్మాగాంధీకి నివాళులు అర్పించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా గాంధీ స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. భాష, ప్రాంతం, కులం వారీగా విభజించబడిన దేశాన్ని గాంధీ ఏకం చేశారని, స్వాతంత్ర్య ఉద్యమానికి విస్తృత పరిధిని ఇచ్చారని అమిత్ షా సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. మహోన్నత భారతదేశాన్ని నిర్మించడంలో గాంధీ దార్శనికతను ఆయన ప్రశంసించారు. భారతదేశ స్వాతంత్ర్యం, ఐక్యత కోసం ప్రాణాలను అర్పించిన స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరులకు నివాళులు అర్పించేందుకు ప్రతి సంవత్సరం జనవరి 30వ తేదీని అమరవీరుల దినోత్సవంగా పాటిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర హోంమంత్రి అమిత్ షా అస్సాంలోని దిబ్రుగఢ్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఈరోజు ప్రారంభించారు. 284 కోట్ల రూపాయలతో నిర్మించనున్న రెండవ శాసనసభ సముదాయాన్ని, ఎమ్మెల్యే హాస్టల్‌కు శంకుస్థాపన చేసి, 238 కోట్ల రూపాయల విలువైన ఆధునిక బహుళ-క్రమశిక్షణా క్రీడా సముదాయం తొలి దశను ప్రారంభించారు. ఈ సందర్భంగా దిబ్రుగఢ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ద్వారా యూరోపియన్ దేశాలకు అస్సాం టీ ఎగుమతులు పెరుగుతాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో, కేంద్రప్రభుత్వం అస్సాం అభివృద్ధి కోసం మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను తీసుకువచ్చిందని, బిజెపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం శాంతి, అభివృద్ధితో ఉందన్నారు. ఎగువ అస్సాం ప్రజలకు ఇది చారిత్రాత్మక దినమని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

భద్రతా మండలి శాశ్వత సభ్యుల జాబితాలో ఆసియా ప్రాతినిధ్యం తక్కువగా ఉందని, దీనిని సవరించవలసి ఉందని ఐక్యరాజ్యసమితి UN ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ అన్నారు. ఈ సంవత్సరం తన ప్రాధాన్యతల గురించి ఆయన మాట్లాడుతూ.. శాంతి, భద్రతా వ్యవస్థల కేంద్రబిందువు ఐక్యరాజ్యసమితిలోనే ఉన్నందున మండలిని సంస్కరించడం ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు. భద్రతా మండలిలో ఆసియా ప్రాతినిధ్యం తక్కువగా ఉన్నందున తిరిగి సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భద్రతా మండలిలో సంస్కరణల ప్రక్రియను కొన్ని దేశాలు అడ్డుకోవడంపై ఆయన విమర్శలు చేశారు. శాశ్వత సభ్యుల వీటో హక్కులపై ఆంక్షలు విధించే ఆలోచనకు కూడా తాను మద్దతు ఇస్తున్నానని గుటెరెస్ పేర్కొంటూ.. ఇవి అనేక సమస్యలపై కౌన్సిల్ చర్య తీసుకోవడానికి ప్రధాన అడ్డంకిగా ఉన్నాయన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ విశాఖపట్నంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ (NIO) కు చెందిన షోర్-బేస్డ్ లాబొరేటరీని ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అభివృద్ధిని వేగవంతం చేస్తుందని అన్నారు. ఈ ప్రాజెక్టుకు సంవత్సరాల క్రితం పునాది వేయబడిందని, అయితే ఇటీవలి 8 -10 నెలల్లో గణనీయమైన పురోగతి సాధించి, పూర్తయ్యిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ వెంబడి వెయ్యి కిలోమీటర్లకు పైగా తీరప్రాంతం ఉందని, ఇది సముద్ర ఆర్థిక వ్యవస్థకు, ప్రధానమంత్రి బ్లూ ఎకానమీ దార్శనికతకు సహజ కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. కొత్తగా ప్రారంభించబడిన CSIR-NIO సౌకర్యం దీనికి వెన్నెముకగా నిలుస్తుందని డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

చురుకైన పాలన, సమయానుకూల అమలు కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2015 సంవత్సరంలో Pro-Active Governance and Timely Implementation, PRAGATI ని ప్రారంభించారు. ప్రారంభం నుండి ప్రధానమంత్రి ప్రత్యక్ష సమీక్ష ద్వారా కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ప్రజా ఫిర్యాదుల పర్యవేక్షణ, పరిష్కరించడం ద్వారా పాలనా విధానాన్ని మార్చింది. పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు సంబంధించిన ప్రాజెక్టులను ఈరోజు పరిశీలిద్దాం. దేశ పౌర విమానయాన మౌలిక సదుపాయాలను పెంచడానికి, PRAGATI నేతృత్వంలోని పర్యావరణ వ్యవస్థ కింద మొత్తం 90 వేల 978 కోట్ల రూపాయల పెట్టుబడితో 38 ప్రాజెక్టులను పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రాజెక్టులలో మొత్తం 21 వేల 694 కోట్ల రూపాయల పెట్టుబడితో మూడు ప్రాజెక్టులను PRAGATI కింద ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమీక్షించారు. ప్రగతి సమీక్షల సందర్భంగా జారీ చేయబడిన ఆదేశాలు జవాబుదారీతనాన్ని పెంచాయి. 19 ప్రాజెక్టులలోని ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ పోర్టల్‌లో మొత్తం 53 సమస్యలు లేవనెత్తబడి, వీటిలో 51 సమస్యలు పరిష్కరించబడ్డాయి. ప్రగతి నేతృత్వంలోని పర్యవేక్షణ విధానం పౌర విమానయాన ప్రాజెక్టులను వేగంగా ట్రాక్ చేయడంలోను, దేశవ్యాప్తంగా భారతదేశ విమానాశ్రయ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించింది.

= = = = = = = = = = = = = = = = = = =

వచ్చే నెల 16వ తేదీ నుండి 20వ తేదీ వరకు న్యూఢిల్లీలో ఇండియా-AI ఇంపాక్ట్ సమ్మిట్-2026 జరగనుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ సమ్మిట్ ఇప్పటివరకు ప్రపంచంలోనే అతిపెద్ద AI సమ్మిట్ కానుందని చెప్పారు. 100 మందికి పైగా CEOలు AI ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొంటున్నారని అన్నారు. భారతదేశం తన AI పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేసిన విధానం ప్రోత్సాహకరంగా ఉందని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్…30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చిన వెంటనే, యూరోపియన్ యూనియన్‌కు భారతదేశం చేసే ఎగుమతులకు ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. దేశం ఇప్పుడు 50 బిలియన్ US డాలర్ల వస్త్ర ఎగుమతులను సాధించాలని ఆకాంక్షిస్తోందని అన్నారు. ఇది కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టించడానికి కూడా సహాయపడుతుందన్నారు. భారత్ -EU స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దేశాన్ని అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాలకు కేంద్రంగా నిలుపుతుందని పేర్కొంటూ...

(వాయిస్…30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్.. లిబియా విదేశాంగ మంత్రి ఎల్తాహెర్ ఎల్బ్బార్‌తో ఢిల్లీలో ఈరోజు సమావేశమయ్యారు. వాణిజ్యం, వ్యాపారం, మౌలిక సదుపాయాలు, ఇంధన రంగాలలో సహకారాన్ని పెంపొందించడంపై వారు చర్చలు జరిపారు. లిబియా విదేశాంగ మంత్రి తమ దేశ పరిస్థితిపై ఇచ్చిన వివరణను జైశంకర్ ప్రశంసిస్తూ.. లిబియాలో శాంతి, స్థిరత్వాన్ని నెలకొల్పేందుకు భారత్ దౌత్య పరమైన మద్దతు ఇస్తుందని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =